


APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు సంపుటి -1 సంచిక -97 పేజీలు-4 గురువారం 27 ఆగస్టు 2026 వెల4/-

## ఆరోగ్యానికి భారీ నిధులు

- ఎన్‌హెచ్‌ఎం కింద ఏపీకి రూ.2,447.98 కోట్లు
- కంద్రం వాటా రూ.1,468.79 కోట్లు.. రాష్ట్ర వాటా రూ.979.19 కోట్లు
- వైద్య సిబ్బంది వేతనాలకు రూ.1,008.50 కోట్లు..
- అత్యవసర సేవలు, టెలీకన్సల్టేషన్‌కు పెద్దపీట

03



ప్రభుత్వ వైద్య వ్యవస్థకు భారీ ఊతం లభించింది. ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా 2026--27 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,447.98 కోట్ల వార్షిక ప్రణాళికకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం రూ.1,468.79 కోట్లు, రాష్ట్ర వాటా రూ.979.19 కోట్లు. వైద్య సిబ్బంది, అత్యవసర సేవలు, ఉచిత మందులు, టెలీ వైద్యం, క్షయ--క్యాన్సర్--మధుమేహ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చారు.



# తెరపైకి మళ్లీ

# జలవివాదం

- నాగార్జునసాగర్ వద్ద ఏపీ
- తెలంగాణ అధికారుల మధ్య ఉద్రిక్తత
- కుడి, ఎడమ కాలువలకు చెరో 2 వేల క్యూసెక్కుల విడుదల
- సెప్టెంబరు 4న మరోసారి కేఆర్‌ఎంబీ భేటీ

**కృష్ణా జలాల పంచాయితీ మళ్లీ ముదిరింది. నాగార్జునసాగర్ కేంద్రంగా ఏపీ--తెలంగాణ మధ్య మరోసారి నీటి విడుదల వివాదం రాజుకుంది. కేఆర్‌ఎంబీ నీటి పంపకాలపై తుది నిర్ణయం తీసుకోకముందే సాగర్ కుడి, ఎడమ కాలువలకు ఇరు రాష్ట్రాల అధికారులు నీటిని విడుదల చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తాగునీటి అవసరాల పేరుతో ఎవరి వాటా మేరకు ఎవరు నీటిని తీసుకోవాలన్న దానిపై ఇరు రాష్ట్రాల మధ్య విభేదాలు మళ్లీ భగ్గుమన్నాయి.**

**అమరావతి/హైదరాబాద్, రక్షణ బ్యూరో**

: కృష్ణా జలాల పంపిణీ వివాదం మరోసారి భగ్గుమంది. నీటి వాటాలపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో.. తాజాగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికారుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. బుధవారం ఏపీ అధికారులు సాగర్ కుడి కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. తెలంగాణ అధికారులు స్పందిస్తూ ఎడమ కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

**47 టీఎంసీలు కావాలన్న ఏపీ...**కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాల

మిగతా 2 లో




02

## హిమాలయాల్లో భూకంపం.. నేపాల్‌లో జలప్రళయం

- భోటేకోశి నదికి ఒక్కసారిగా పోటెత్తిన వరద..
- 160 మంది మృతి.. వందలాది మంది గల్లంతు

**హిమాలయాల్లో భూకంపం.. ఆ వెంటనే హిమనదులు, కొండ చరియలు కదిలి నేపాల్‌లోని భోటేకోశి నదికి ఒక్కసారిగా వరద పోటెత్తింది. క్షణాల్లోనే ఇళ్లు, వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. నేపాల్‌లో 157 మంది మృతి చెందగా, వందలాది మంది గల్లంతయ్యారు. టిబెట్‌లోనూ ప్రాణనష్టం జరిగింది. భారతీయులు సహా వందలాది మంది పర్యాటకుల ఆచూకీ తెలియక పోవడంతో విషాదం మరింత తీవ్రంగా మారింది.**

**రక్షణ న్యూస్, కాఠ్మాండు:**

నేపాల్--టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతం ప్రకృతి ప్రకోపానికి వణికిపోయింది. బుధవారం ఒక్కసారిగా సంభవించిన భారీ వరదలు, కొండచరియలు, మంచు--రాళ్ల ప్రవాహం నేపాల్‌లోని రసువా జిల్లాను అతలాకుతలం చేశాయి. భోటేకోశి నదిలో అకస్మాత్తుగా నీటి మట్టం పెరగడంతో గ్రామాలు, రహదారులు, వంతెనలు, ఇళ్లు, విద్యుత్ మౌలిక వసతులు కొట్టుకుపోయాయి. నేపాల్‌లో 157 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించగా.. టిబెట్‌లో మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మొత్తం మృతుల సంఖ్య 160కు చేరింది. వందలాది మంది ఆచూకీ తెలియకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూకంపంతో మొదలైందా?....**ఈ విపత్తుకు కొద్దిసేపటి ముందు హిమాలయ ప్రాంతంలో భూప్రకంపనలు నమోదయ్యాయి.

మిగతా 2 లో



వివరాలు 2వ పేజీలో


## అమెరికా వీసా ఇంటర్వ్యూలకు తాత్కాలిక బ్రేక్

- ప్రపంచవ్యాప్తంగా
- అపాయింట్‌మెంట్లు వాయిదా..
- కొత్త తేదీలపై స్పష్టత కరవు

**అమెరికా వెళ్లి శాశ్వతంగా స్థిరపడాలనుకునే వారికి ట్రంప్ ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా రాయబార కార్యాల యా లు, కాన్సులేట్‌లలో ఇమ్మిగ్రెంట్ వీసా ఇంట ర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఇప్పటికే ఖరారైన ఇంటర్వ్యూ తేదీలను వాయిదా వేస్తూ దరఖాస్తుదారులకు ఈ-మెయిళ్లు పంపుతోంది. కొత్త తేదీలు ఎప్పుడు ఇస్తారన్నదానిపై స్పష్టత లేకపోవడంతో వేలాది మంది ఆందోళన చెందుతున్నారు.**

## కోదాడ వద్ద ఘోర ప్రమాదం.. ఆరుగురి దుర్మరణం

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు.. ఇనుప రాడ్లు దూసుకెళ్లి విషాదం





వివరాలు 2వ పేజీలో

**ఇంటికి చేరుతామన్న ఆశతో రాత్రివేళ బస్సెక్కిన వారి ప్రయాణం.. తెల్లారేసరికి ఆరు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి ఏలూరువైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు కోదాడ సమీపంలో ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. నిద్రలోనే మృత్యువు కబళించడంతో కుటుంబసభ్యులకు చివరి చూపు కూడా మిగలని విషాదం నెలకొంది.**

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

03



ఏఐ ఆధారిత వైద్య సేవలకు పెద్దపీట..

కుప్పం, చిత్తూరు ఫలితాలతో విస్తరణ90 రోజుల కార్యాచరణకు శ్రీకారం.. డిజిటల్ ఆరోగ్య రికార్డులతో మెరుగైన సేవలు

ఆసుపత్రి గడప తొక్కకముందే అనారోగ్యాన్ని గుర్తించి.. వ్యాధి ముదరకముందే అడ్డుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతతో ప్రజల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే 'సంజీవని' ప్రాజెక్టును 2027 జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనుంది. కుప్పం, చిత్తూరులో ప్రయోగాత్మకంగా సాధించిన ఫలితాల ఆధారంగా ఈ సేవలను అన్ని జిల్లాల ప్రజలకు చేరువ చేయనున్నారు.

# రైతు కన్నీళ్లకు ప్రభుత్వమే బాధ్యత

- కరువు కమ్ముకున్నా స్పందన లేదు.. రైతులను నట్టేట ముంచుతున్నారు: వైఎస్ జగన్



వివరాలు 2వ పేజీలో

**కరువు కళ్లముందే కనిపిస్తున్నా.. బాబు సర్కార్ కుంభకర్ణుడిలా నిద్రపోతోంది!రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు ఎండిపోతుంటే పట్టించుకోరా? శ్రీశైలంలో నీరున్నా సాగుకు ఇవ్వకుండా విద్యుత్ ఉత్పత్తికే ప్రాధాన్యమిస్తారా? రాష్ట్రంలో మాఫియాలు విచ్చలవిడిగా నడుస్తున్నా ప్రభుత్వం మౌనం వహిస్తోందని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు, యువత, బీసీలు, సామాన్య ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. కరువు పరిస్థితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.**

## 23 రోజుల ఉత్కంఠకు తెర...




వివరాలు 2వ పేజీలో

- బెంగాల్ తీరంలో ఏడుగురు క్షేమం
- ఇంజిన్ మొరాయించడంతో
- గాలివాటానికి కొట్టుకెళ్లిన బోటు..
- కోస్ట్‌గార్డు గాలింపుతో ఆచూకీ

**సముద్రంలోకి వెళ్లిన తమవారు తిరిగి వస్తారో లేదో తెలియక 23 రోజులుగా తీరంవైపు ఆశగా చూస్తున్న ఏడు మత్స్యకార కుటుంబాల కన్నీళ్లకు ఎట్టకేలకు ఆనందం తోడైంది. మూడు రోజుల పాటు తిండి లేక నీళ్లతోనే ప్రాణాలు నిలుపుకొంటూ మృత్యువుతో పోరాడిన తమవారు క్షేమంగా ఉన్నారన్న సమాచారం అందడంతో కుటుం బసభ్యులు కన్నీటితోనే ఊపిరిపీల్చుకున్నారు.**

26-5-26 rakshana main_Layout 1 8/27/2026 6:21 AM Page 2



# తెరపైకి మళ్లీ జలవివాదం

మొదటి పేజీ తరువాయి

కోసం అక్టోబరు 31 వరకు అదనంగా 47 టీఎంసీల నీటిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కేఆర్ఎంబీని కోరింది. ఇందులో పోతిరెడ్డిపాడు ద్వారా 22 టీఎంసీలు, హంద్రీ-నీవా ద్వారా 11 టీఎంసీలు, నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా 7 టీఎంసీలు, కృష్ణా డెల్టా వ్యవస్థకు 6 టీఎంసీలు, ఎడమ కాలువ ద్వారా ఒక టీఎంసీ ఇవ్వాలని ప్రతిపాదించింది. పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నీరు అత్యవసరమని ఏపీ అధికారులు పేర్కొన్నారు.

**సమానంగా ఇవ్వాల్సిందే..**ఏపీకి ఎంత నీటిని కేటాయిస్తే తమకూ అంతే మొత్తాన్ని కేటాయించాలని తెలంగాణ వాదిస్తోంది. ప్రస్తుతం 50:50 నిష్పత్తిలో నీటిని వినియోగించుకోవాలని ప్రతిపాదించింది. అంతేకాకుండా ఏడాది మొత్తానికి అవసరాలను పరిగణనలోకి తీసుకుని తమకు 112 టీఎంసీలు కేటాయించాలని కోరింది. అయితే ప్రాజెక్టుల వారీగా నీటి అవసరాలకు సంబంధించిన పూర్తి ఇండెంట్‌ను సమర్పించాలని కేఆర్ఎంబీ తెలంగాణను కోరింది.మరోవైపు అందుబాటులో ఉన్న నీటిని ప్రస్తుతం తాగునీటి అవసరాలకే ప్రాధాన్యమిస్తూ వినియోగించాలని కేఆర్ఎంబీ సూచించింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తులో వచ్చే ప్రవాహాలు, రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై బోర్డు చర్చించింది. అయితే నీటి కేటాయింపులపై తుది నిర్ణయం తీసుకోలేకపోయింది. దీంతో తదుపరి సమావేశాన్ని సెప్టెంబరు 4కు వాయిదా వేసింది. అప్పటి వరకు తాగునీటి అవసరాల కోసం ప్రస్తుత దామాషాలోనే నీటిని విడుదల చేయాలని సూచించింది.

**సాగర్ వద్ద మళ్లీ ఘర్షణ వాతావరణం...**కేఆర్ఎంబీ సమావేశం వాయిదా పడిన కొద్దిరోజులకే సాగర్ వద్ద నీటి విడుదల అంశం వివాదానికి దారితీయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీ అధికారులు కుడి కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, తెలంగాణ అధికారులు తమ తాగునీటి అవసరాలను ప్రస్తావిస్తూ ఎడమ కాలువకు అదే పరిమాణంలో నీటిని విడుదల చేశారు. నీటి విడుదలకు సంబంధించి ఎవరి అనుమతి ఉందనే అంశంపై ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.ఏపీ వాదన ప్రకారం.. సాధారణ నీటి లభ్యత తక్కువగా ఉండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల తాగునీటి అవసరాలను తీర్చేందుకు 47 టీఎంసీలను కోరింది. తమకు కేటాయించిన వాటాలోనే అత్యవసరంగా కొంత నీటిని కుడి కాలువ ద్వారా తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే తెలంగాణ కృష్ణా ప్రాజెక్టుల నుంచి సుమారు 20.06 టీఎంసీలు వినియోగించుకోగా.. ఏపీ 13.62 టీఎంసీలు మాత్రమే వినియోగించుకుందని ఏపీ అధికారులు లెక్కలు చూపుతున్నారు.

**వాటాలపై సుదీర్ఘ పోరు...**కృష్ణా జలాల శాశ్వత పంపిణీ అంశం ఇప్పటికే కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 పరిధిలో ఉంది. తాత్కాలిక కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్వహణ, నీటి విడుదల, పోతిరెడ్డిపాడు వినియోగం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య తరచూ విభేదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా దక్కాలని, అంతర్రాష్ట్ర వివాదాలను చట్టబద్ధ విధానాల్లోనే పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు.

**సెప్టెంబరు 4న కీలక భేటీ...**ఇప్పటికైతే నాగార్జునసాగర్ నీటి విడుదలతో మరోసారి జలవివాదం తెరపైకి వచ్చింది. తాగునీటి అవసరాలే ప్రధాన ప్రాధాన్యంగా ఉన్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడం కేఆర్ఎంబీకి సవాలుగా మారింది. సెప్టెంబరు 4న జరిగే తదుపరి త్రిసభ్య కమిటీ సమావేశంలో నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల వారీగా ఇండెంట్లు, నీటి విడుదలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అప్పటివరకు సాగర్ జలాల వినియోగంపై ఇరు రాష్ట్రాలూ సంయమనం పాటించాల్సిన పరిస్థితి నెలకొంది.

# కోదాడ వద్ద ఘోర ప్రమాదం.. ఆరుగురి దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

కోదాడ, రక్షణ న్యూస్..




హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తాజా సమాచారం ప్రకారం 14 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో దొరకుంట వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన కంటైనర్ అంతకుముందే మరో ఘటనలో రోడ్డుపై నిలిచిపోయినట్లు తెలుస్తోంది. అందులో భారీ ఇనుప రాడ్లు ఉండటంతో బస్సు ఢీకొన్న సమయంలో అవి బస్సులోకి దూసుకెళ్లాయి. దీంతో ముందు భాగంలో ఉన్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కొందరు ప్రయాణికులు బస్సులో ఇరుక్కుపోయారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఘటనాస్థలం భీతావహంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసి కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిలో కొందరిని ఖమ్మం, విజయవాడ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతులంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారిగా సమాచారం. విజయవాడ, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాంతాలకు చెందిన వారు రక్షాబంధన్ సందర్భంగా స్వస్థలాలకు వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. మృతుల్లో 23 ఏళ్ల భావనా వర్ష కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో హెచ్ఆర్ ఉద్యోగానికి రాజీనామా చేసి విజయవాడకు బయలుదేరిన ఆమె ప్రయాణం విషాదాంతమైంది.

**ప్రమాదానికి ముందు కీలక పరిణామం**

ప్రమాదానికి కొద్దిసేపటి ముందు మరో ప్రైవేట్ బస్సు డ్రైవర్ రోడ్డుపై ప్రమాదకరంగా నిలిచిపోయిన కంటైనర్‌ను గుర్తించి పక్కకు జరపాలని హెచ్చరించినట్లు సమాచారం. అయితే అది అక్కడే ఉండిపోయింది. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న మరో బస్సు అదే కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి బస్సు అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణమై ఉండొచ్చని సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ ప్రాథమికంగా వెల్లడించారు. అయితే పూర్తి దర్యాప్తు అనంతరం ప్రమాదానికి అసలు కారణాలు స్పష్టమవుతాయని అధికారులు తెలిపారు. ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ ప్రమాదస్థలిని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

# రైతు కన్నీళ్లకు ప్రభుత్వమే బాధ్యత

మొదటి పేజీ తరువాయి

అమరావతి: రక్షణ బ్యూరో..



రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. రైతులకు సాగునీరు అందిస్తామని ముందుగా హామీలు ఇచ్చి, వారి మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన తర్వాత చేతులెత్తేయడం దారుణమన్నారు. బుధవారం తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని జగన్ పేర్కొన్నారు. జూన్ నుంచి ఇప్పటివరకు వర్షపాతం గణనీయంగా తగ్గిందని, 688 మండలాల్లో 625 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ముందే ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సాగునీరు అందుతుందన్న ప్రభుత్వ హామీని నమ్మి రైతులు ఎకరాకు రూ.15 వేలకుపైగా పెట్టుబడి పెట్టారని, ఇప్పుడు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని జగన్ డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించకుండా విద్యుదుత్పత్తికి వినియోగించడం సరికాదన్నారు. రాయలసీమకు నీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు మరింత తగ్గే అవకాశం ఉందని పేర్కొంటూ, రాబోయే రోజుల్లో రైతులకు నీరు ఎలా అందిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ అంశంపైనా జగన్ ప్రభుత్వాన్ని సవాల్ చేశారు. నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ తాము ఆధారాలతో ప్రశ్నలు లేవనెత్తామని, దీనిపై సీబీఐ విచారణకు సిద్ధమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించినా సమాధానం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం తన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ఇతర అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక తదితర వ్యవహారాల్లో అవినీతి, దోపిడీ పెరిగిందని జగన్ ఆరోపించారు. అధికార వ్యవస్థను ఉపయోగించుకుని ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టడం ద్వారా భయపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు.అమరావతి నిర్మాణంపైనా జగన్ తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని పేరుతో భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలకు స్పష్టమైన ప్రయోజనం కనిపించడం లేదని, రాజధాని వ్యవహారంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని జగన్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాజకీయ ప్రచారానికే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. మొత్తంగా రైతులు, యువత, బీసీలు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందని జగన్ స్పష్టం చేశారు.

# హిమాలయాల్లో భూకంపం.. నేపాల్‌లో జలప్రళయం

మొదటి పేజీ తరువాయి

అమెరికా భూగర్భ పరిశోధన సంస్థ (ఖూ+టూ) రికార్డుల ప్రకారం ఆ ప్రాంతానికి సమీపంలో 5.2 తీవ్రతతో భూకంపం నమోదైంది. తొలుత 4.4 తీవ్రతతో భూకంపంగా గుర్తించిన ప్రకంపనలపై కూడా వార్తలు వచ్చాయి. అయితే వరదకు అసలు కారణం భూకంపమేనా? లేక దాని ప్రభావంతో మంచు--రాళ్ల కొండచరియ విరిగిపడటమా? అన్నదానిపై నిపుణుల పరిశీలన కొనసాగుతోంది. ఉపగ్రహ చిత్రాలు, నిపుణుల విశ్లేషణల ప్రకారం హిమనదిలోని ఒక భాగం విరిగిపడి భారీగా మంచు, రాళ్లు, మట్టి దిగువకు దూసుకురావడంతో నదిలో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగినట్లు తెలుస్తోంది**ఏడు నిమిషాల్లోనే బీభత్సం..**వరదకు ముందు నమోదైన భూప్రకంపనలకు, వరద ఉధృతికి మధ్య వ్యవధి చాలా తక్కువగా ఉన్నట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. టిబెట్ వైపు ఉన్న హిమాలయ ప్రాంతంలో మంచు--రాళ్ల భారీ ప్రవాహం ఏర్పడి లెహెండే ఖోలా నదిలోకి దూసుకెళ్లింది. అక్కడి నుంచి భోటేకోశి నదిలోకి నీరు, మట్టి, బండరాళ్లు పోటెత్తడంతో దిగువ ప్రాంతాలు ఒక్కసారిగా ముంపునకు గురయ్యాయి. నదీ ప్రవాహం వేగంగా పెరగడంతో తప్పించుకునే అవకాశం కూడా లేకుండా పోయింది.

**పర్యాటకులే అధికంగా గల్లంతు...**ఈ విపత్తు సమయంలో టిబెట్ వైపు ప్రయాణిస్తున్న పర్యాటకులు, కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతయ్యారు. నేపాల్ టూరిజం బోర్డు ప్రాథమిక వివరాల ప్రకారం వందలాది మంది ప్రయాణికుల ఆచూకీ తెలియడం లేదు. గల్లంతైన వారిలో భారతీయులు సహా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలకు చెందినవారు ఉన్నారు. భారతీయుల సంఖ్య కూడా 100కు పైగా ఉన్నట్లు పలు అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి.

**రహదారులు.. వంతెనలు ధ్వంసం...**వరద ఉధృతికి అనేక వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం సహాయక బృందాలకు కష్టంగా మారింది. రహదారులు మట్టితో, బండరాళ్లతో నిండిపోయాయి. విద్యుత్ ప్రాజెక్టులు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పలు జలవిద్యుత్ కేంద్రాలపై కూడా ప్రభావం పడింది. హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ వాతావరణ పరిస్థితులు, ధ్వంసమైన మౌలిక వసతులు ఆటంకంగా మారుతున్నాయి.

**రెండోసారి వరద ముప్పు?...**ఎగువ ప్రాంతాల్లో మరిన్ని మంచు--రాళ్ల నిల్వలు కదిలే ప్రమాదం ఉండటంతో మరోసారి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని హెచ్చరికలు వెలువడ్డాయి. భోటేకోశి, త్రిశూలి, నారాయణి నదుల పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇప్పటికే సహాయక, గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భారతదేశం కూడా నేపాల్‌కు సహాయక సామగ్రిని పంపడం ప్రారంభించింది. ఇదిలా ఉంటే ఈ ఘటనపై మృతులు, గల్లంతైన వారి సంఖ్య గంట గంటకూ మారుతోంది. భూకంపం--హిమనది విరిగిపడటం--కొండచరియల కదలికల మధ్య ఖచ్చితమైన కారణ సంబంధాన్ని అధికారులు ఇంకా నిర్ధారిస్తున్నారు.

# అమెరికా వీసా ఇంటర్వ్యూలకు తాత్కాలిక బ్రేక్

మొదటి పేజీ తరువాయి

వాషింగ్టన్: రక్షణ న్యూస్..

అమెరికా వెళ్లాలనుకునే వలసదారులకు ఊహించని షాక్ తగిలింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో ఇమ్మిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. భారత్ సహా పలు దేశాల్లో ఇప్పటికే ఇంటర్వ్యూలకు తేదీలు ఖరారైన దరఖాస్తుదారులకు ఈ విషయాన్ని ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తున్నారు. అయితే కొత్త ఇంటర్వ్యూ తేదీలు ఎప్పుడు కేటాయిస్తారన్న దానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. అమెరికా విదేశాంగ శాఖ ప్రారంభించిన ప్రపంచవ్యాప్త శిక్షణ కార్యక్రమం కారణంగానే వీసా సేవల అపాయింట్‌మెంట్లను సర్దుబాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాన్సులర్ అధికారులకు వీసా దరఖాస్తుదారులను మరింత సమగ్రంగా పరిశీలించడం, అమెరికా ప్రభుత్వ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తయ్యే వరకు ఇంటర్వ్యూల షెడ్యూల్‌లో మార్పులు కొనసాగనున్నాయి. అయితే సాధారణ సేవలు ఎప్పటి నుంచి పునరుద్ధరిస్తారో అమెరికా ప్రభుత్వం చెప్పలేదు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన పలువురు భారతీయ దరఖాస్తుదారులకు అపాయింట్‌మెంట్లు రద్దు లేదా వాయిదా పడినట్లు సమాచారం అందుతోంది. కొత్త తేదీని తరువాత తెలియజేస్తామని ఈ-మెయిల్‌లో పేర్కొంటున్నారు. దీంతో అమెరికాలో స్థిరపడేందుకు కుటుంబ వీసాలు, ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం ఎదురుచూస్తున్నవారిలో ఆందోళన నెలకొంది. కొందరు విమాన టికెట్లు, వసతి, ప్రయాణ ఏర్పాట్ల కోసం ముందుగానే భారీగా ఖర్చు చేయడంతో ఇప్పుడు ఆర్థిక నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. అయితే ఇది అన్ని రకాల అమెరికా వీసాలపై పూర్తిస్థాయి నిషేధం కాదని గమనించాలి. తాజా అధికారిక వివరాల ప్రకారం ప్రధానంగా ఇమ్మిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూలపైనే ఈ అంతరాయం ప్రభావం చూపుతోంది. పర్యాటక, విద్యార్థి, తాత్కాలిక ఉద్యోగ వంటి నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల విషయంలోనూ కొన్ని చోట్ల అపాయింట్‌మెంట్ల మార్పులు నమోదైనప్పటికీ, వాటి పరిస్థితి వేర్వేరుగా ఉండొచ్చని తాజా నివేదికలు సూచిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే ఇమ్మిగ్రేషన్‌పై కఠిన వైఖరి అవలంబిస్తున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసాలు, గ్రీన్‌కార్డులపై కఠిన పరిశీలన, దరఖాస్తులపై అదనపు తనిఖీలు వంటి చర్యల మధ్య ఈ తాత్కాలిక విరామం రావడంతో అమెరికా వెళ్లాలనుకునే వారిలో మరింత అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం దరఖాస్తుదారులు తమకు వచ్చిన ఈ-మెయిళ్లను జాగ్రత్తగా పరిశీలిస్తూ, కొత్త ఇంటర్వ్యూ తేదీ కోసం అమెరికా రాయబార కార్యాలయం నుంచి వచ్చే సమాచారాన్ని వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# 23 రోజుల ఉత్కంఠకు తెర..

మొదటి పేజీ తరువాయి

అమలాపురం, రక్షణ న్యూస్..

సముద్రంలోకి వెళ్లిన తమవారు తిరిగొస్తారో.. లేదోనన్న ఆందోళనతో 23 రోజులుగా ఎదురుచూస్తున్న ఆ కుటుంబాలకు ఎట్టకేలకు ఊరట లభించింది. కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో క్షేమంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో ఇన్నాళ్లూ ఆందోళనలో ఉన్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకుని నిర్ణీత సమయంలో తిరిగి రావాల్సి ఉన్నా.. రోజులు గడుస్తున్నా వారి జాడ తెలియలేదు. కుటుంబ సభ్యుల నుంచి సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టింది. తొలుత విశాఖపట్నం నుంచి పారాదీప్ మధ్య సముద్ర ప్రాంతంలో గాలింపు చేపట్టగా.. తరువాత పరిధిని మరింత విస్తరించారు.

**ఇంజిన్ ఆగిపోయి.. గాలివాటానికి...**అధికారుల వివరాల ప్రకారం బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఇంజిన్ మొరాయించింది. దీంతో బోటు ప్రయాణాన్ని కొనసాగించలేక సముద్ర ప్రవాహం, గాలివాటానికి కొట్టుకుపోయింది. చివరకు పశ్చిమ బెంగాల్ వైపు చేరింది. బెంగాల్ తీరానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో బోటును భద్రతా దళాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బోటులో ఉన్న మత్స్యకారులు మరో బోటు సిబ్బంది గుర్తించడంతో వారి ఆచూకీ బయటపడింది. అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం అందింది. కోస్ట్‌గార్డు, నేవీ, మెరైన్ పోలీసుల సమన్వయంతో సాగిన గాలింపు చర్యలకు ఫలితం దక్కింది. మత్స్యకారులు ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారని అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

**మూడు రోజులుగా తిండిలేక..**గల్లంతైన మత్స్యకారుల్లో ఒకరైన రాంబాబు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి తమ పరిస్థితిని వివరించారు. బోటు ఇంజిన్ ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మూడు రోజులపాటు ఆహారం కూడా అందలేదని తెలిపారు. మరో బోటు వారు తమను గుర్తించి సహాయం చేయడంతో తమ ఆచూకీ అధికారులకు చేరిందన్నారు. ప్రస్తుతం తాము క్షేమంగానే ఉన్నామని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. గల్లంతైన ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ పరిస్థితిని పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించింది. నేవీ, కోస్ట్‌గార్డు తదితర విభాగాల సమన్వయంతో శోధన కొనసాగింది. ఇన్నాళ్ల నిరీక్షణకు తెరపడటంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఇప్పుడు ఒక్కటే ఆశ---తమవారు త్వరగా ఇంటికి చేరాలి.

26–5–26 rakshana main_Layout 1 8/27/2026 6:21 AM Page 3



# జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

మొదటి పేజీ తరువాయి

అమరావతి: రక్షణ బ్యూరో

వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గించి.. వ్యాధిని ముందుగానే గుర్తించి.. అవసరమైన చికిత్సను సకాలంలో అందించడంతోపాటు రోగి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. 'సంజీవని' ప్రాజెక్టును వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన అనుభవాలు, ఫలితాలను ఆధారంగా చేసుకుని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు దీనిని విస్తరించనున్నారు.వైద్య రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవడమే సంజీవని ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా నిర్వహించనున్నారు. ఒకసారి నమోదైన ఆరోగ్య వివరాలు తదుపరి వైద్య సేవల్లో ఉపయోగపడేలా వ్యవస్థను రూపొందించనున్నారు. దీంతో రోగి గత వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలు, చికిత్స వివరాలను అందుబాటులో ఉంచి వైద్యులు మరింత సమర్థంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**కుప్పం, చిత్తూరు ఫలితాలతో..**సంజీవని ప్రాజెక్టును తొలుత కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో అమలు చేశారు. అక్కడ వచ్చిన ఫలితాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం నియంత్రణలోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మధుమేహం కేసుల్లో వ్యాధి తీవ్రత 16 శాతం తగ్గినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య సేవల వినియోగం కూడా పెరిగినట్లు పేర్కొన్నారు. సంజీవని సేవలపై నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారిలో 91 శాతం మంది తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని అభిప్రాయపడినట్లు అధికారులు వివరించారు.

**90 రోజుల కార్యాచరణ...**రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టును అమలు చేసేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయిలో ఆరోగ్య పరిస్థితులపై అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవసరమైన సాంకేతిక వ్యవస్థల అనుసంధానం వంటి చర్యలు చేపట్టనున్నారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి సంజీవని విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జాతీయ, రాష్ట్రస్థాయి ఆరోగ్య పోర్టల్లతో డేటాను అనుసంధానం చేసే ప్రక్రియను కూడా చేపట్టనున్నారు.

**చికిత్సకే పరిమితం కాకుండా..**వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడానికే పరిమితం కాకుండా ముందస్తు అంచనా, నివారణ, చికిత్స, తదుపరి పర్యవేక్షణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజల ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య సేవలు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కుటుంబాలు విద్య, వైద్యంపై గణనీయమైన మొత్తాన్ని ఖర్చు చేస్తున్న నేపథ్యంలో వైద్య వ్యయాల భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**డేటా భద్రతకు ప్రాధాన్యం..**డిజిటల్ ఆరోగ్య రికార్డుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య సమాచార భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వైద్య సేవల్లో సాంకేతికతను వినియోగించడంతోపాటు వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని సురక్షితంగా నిర్వహించే విధానాలను పటిష్ఠం చేయాలని సూచించారు.

**టాటా ఎండీ భాగస్వామ్యం..**సంజీవని ప్రాజెక్టులో టాటా ఎండీ సంస్థ అధికారిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. వైద్యారోగ్య రంగంలో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రతినిధులను సీఎం కోరారు. ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్ర వైద్య వ్యవస్థను దేశానికి ఆదర్శంగా నిలిపేలా చర్యలు చేపట్టాలని సూచించారు.జనవరి 1 నుంచి సంజీవని పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఆరోగ్య సేవలను ఒకే సమగ్ర వ్యవస్థలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కుప్పం, చిత్తూరులో సాధించిన ఫలితాలను రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం చేయడం ద్వారా ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించడంతోపాటు అనారోగ్యాన్ని ముందుగానే గుర్తించి నియంత్రించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

# ఆరోగ్యానికి భారీ నిధులు

విజయవాడ, రక్షణ న్యూస్...



రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులు మంజూరు చేసింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రూ.2,447.98 కోట్ల వార్షిక ప్రణాళికకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం వాటా రూ.1,468.79 కోట్లు కాగా.. రాష్ట్ర వాటా రూ.979.19 కోట్లు. వైద్య సిబ్బంది కొరత, అత్యవసర వైద్య సేవలు, ఉచిత మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు, టెలీ వైద్య సేవలు వంటి కీలక రంగాలకు నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సిబ్బంది వేతనాలకు సింహభాగం...**ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న మానవ వనరుల బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. సిబ్బంది వేతనాలు, మానవ వనరుల కోసం రూ.1,008.50 కోట్లు కేటాయించారు. వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సేవలను సమర్థంగా వినియోగించుకోవడానికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు మెరుగుపడే అవకాశం ఉంది.

**క్షయ నియంత్రణకు రూ.116.50 కోట్లు...**క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమానికి రూ.116.50 కోట్లు కేటాయించారు. ఉచిత రోగ నిర్ధారణ, మందుల పంపిణీ, వ్యాధి పర్యవేక్షణ, చికిత్స కొనసాగింపు వంటి కార్యక్రమాలకు ఈ నిధులు ఉపయోగించనున్నారు. అలాగే ఉచిత రోగ నిర్ధారణ సేవలకు రూ.114.55 కోట్లు, సాధారణ టీకా కార్యక్రమాలకు రూ.97.65 కోట్లు కేటాయించారు.

**108 సేవలకు రూ.92.95 కోట్లు...**అత్యవసర వైద్య సేవలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. 108 అంబులెన్స్ సేవల నిర్వహణకు రూ.92.95 కోట్లు, ఆరోగ్య, సంక్షేమ కేంద్రాల నిర్వహణకు రూ.94.22 కోట్లు కేటాయించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఆసుపత్రులకు తరలించేందుకు వీలు కలుగుతుంది. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, మందులు, వైద్య పరికరాల లభ్యతను మెరుగుపరచడానికీ నిధులు వినియోగించనున్నారు.

**క్యాన్సర్, మధుమేహ నియంత్రణకు..**జీవనశైలి వ్యాధులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం నియంత్రణకు రూ.68.28 కోట్లు కేటాయించారు. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను తొలిదశలో గుర్తించడం, నిరంతరం పర్యవేక్షించడం, అవసరమైన చికిత్స అందించడం వంటి కార్యక్రమాలకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

**ఉచిత మందులు.. డయాలసిస్‌కు నిధులు...**ప్రజలకు ఉచితంగా మందులు అందించేందుకు రూ.77.52 కోట్లు, ఉచిత డయాలసిస్ సేవలకు రూ.67.78 కోట్లు కేటాయించారు. రక్తహీనత నిర్మూలన కార్యక్రమానికి రూ.77.58 కోట్లు, జననీ--శిశు సురక్ష కార్యక్రమానికి రూ.88.66 కోట్లు కేటాయించారు. పట్టణ ఆరోగ్య మిషన్‌కు రూ.79.82 కోట్లు కేటాయించడం ద్వారా పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయనున్నారు.

**టెలీ వైద్యానికి పెద్దపీట...**మారుమూల ప్రాంతాల ప్రజలకు నిపుణుల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అత్యవసర వైద్యం, టెలీకన్సల్టేషన్ తదితర ఐదు కొత్త కార్యక్రమాలకు రూ.75.50 కోట్లు కేటాయించారు. గుండెపోటు బాధితులకు అత్యవసరంగా అందించే స్టెమీ మందుల కొనుగోలుకు రూ.26.60 కోట్లు, కేర్ కోఆర్డినేషన్, టెలీకన్సల్టేషన్ గదులకు రూ.25.88 కోట్లు కేటాయించారు. టెలీ వైద్య సేవల కోసం డెస్క్‌టాప్ కంప్యూటర్లకు రూ.11.01 కోట్లు ఇవ్వనున్నారు. ట్రామా కేర్ పరికరాలకు రూ.7.25 కోట్లు, కాలిన గాయాల చికిత్సకు అవసరమైన పరికరాలకు రూ.4.76 కోట్లు కేటాయించారు.

**గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి...**మారుమూల, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. ఐదు కార్యక్రమాలకు రూ.75.50 కోట్లతోపాటు గిరిజన రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ కార్యక్రమానికి రూ.25.18 కోట్లు కేటాయించారు. మొబైల్ మెడికల్ యూనిట్లకు రూ.12.46 కోట్లు ఇవ్వడం ద్వారా వైద్య సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాలకు సేవలను తీసుకెళ్లే అవకాశం ఉంది.

**రూ.1,175 కోట్ల విడుదల...**2026--27లో ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.1,175.03 కోట్లు విడుదలయ్యాయి. మొత్తం ఆమోదించిన కార్యక్రమాల విలువ అందుబాటులో ఉన్న వనరుల కంటే ఎక్కువగా ఉన్నందున అత్యవసర, కీలక ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం రాష్ట్రానికి సూచించింది. మిగిలిన నిధులను అవసరాన్ని బట్టి ప్రాధాన్య కార్యక్రమాలకు వినియోగించనున్నారు.

**ప్రజలకు నేరుగా ప్రయోజనం...**ఎన్‌హెచ్‌ఎం నిధులతో అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడం, టెలీకన్సల్టేషన్ విస్తరించడం, ఆరోగ్య కేంద్రాల్లో మందులు, టీకాలు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచడంపై దృష్టి సారిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతను పెంచి.. ప్రజలు ఖరీదైన ప్రైవేటు వైద్యంపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిధులను వినియోగించనుంది

# గెలుపు ముంగిట భారత్!

## తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 290

## ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక

## 16 పరుగుల ఆధిక్యంలో శ్రీలంక

## సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్




శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది.అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.




Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District